క్లుప్తంగా

శాస్త్రోక్తంగా తైలాభిషేకం



ప్రత్యేక అలంకరణలో శనీశ్వరస్వామి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వరస్వామికి శనివారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి నువ్వుల నూనె, మంచినూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామివారిని పుష్పాలతో విశేషంగా అలంకరించారు. పూజలనంతరం స్వామివారికి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

అసత్య పోస్టులు పెడితే శిక్షార్హులు



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ నరసింహావర్మ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలోని ఎస్వీఏ ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో శనివారం సోషల్‌మీడియా దుర్వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ నరసింహ వర్మ, న్యాయవాది ప్రజ్ఞశ్రీ మాట్లాడుతూ సైబర్‌క్రైమ్‌తో పాటు పలు అంశాలపై వివరించారు. సోషల్ మీడియాలో అసత్య, అశ్లీలపోస్టులు పెడితే చట్టప్రకారం శిక్షార్హులన్నారు. సోషల్ మీడియా వినియోగంలో విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అనంతరం ఎయిడ్స్ నివారణ దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

శ్రీసిటీలో అగ్ని ప్రమాదం

వరదయ్యపాళ్యం : శ్రీసిటీ పారిశ్రామికవాడలోని ఏసీ పరిశ్రమలకు విడిభాగాలు సరఫరా చేసే ఓ పరిశ్రమలో శనివారం రాత్రి అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. శ్రీసిటీ హైటెక్ పోలీస్ స్టేషన్ సీఐ బీవీ శ్రీనివాసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా.. త్రినాథ్ పరిశ్రమలో స్క్రాప్ నిల్వ ఉంచిన గదిలో అగ్నిప్రమాదం సంభవించడంతో ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి. అయితే పరిశ్రమ నిర్వాహకులు శ్రీసిటీ, సత్యవేడు అగ్నిమాపక కేంద్రాలకు సమాచారం ఇచ్చారు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.

11న ఏడు గంగమ్మల జాతర



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, ఈఓ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలో ఈ నెల 11వ తేదీ ఏడుగంగమ్మల జాతర జరగనుంది. శనివారం ఆలయంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి చేతుల మీదుగా జాతర పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసారి ఏడు గంగమ్మల జాతరను అత్యంత వైభవోపేతంగా నిర్వహించడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఈఓ బాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: జీఎన్‌కండ్రిగలో నీట మునిగిన వరిపంట, ఉధృతంగా ప్రవహిస్తున్న మూడు గండ్లు వారధి కాలువ, గుంతలమయమైన జంబుగోళం రోడ్డు







ముంచెత్తిన ఫెంగల్

- సత్యవేడు, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లో వర్షబీభత్సం
- అన్నదాతలకు తీరని నష్టం
- బుచ్చినాయుడుకండ్రిగలో వేల ఎకరాల్లో మునిగిన వరిపంట
- విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం
- నిండిన మల్లిమడుగు రిజర్వాయర్
- ఏడు విమాన సర్వీసులు రద్దు
- లోతట్టు ప్రాంతాల్లోకి చేరిన వర్షపునీరు
- బురదమయమైన గ్రామీణ రోడ్లు
- కేవీబీపురంలో 5, వరదయ్యపాళెంలో 17 గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- స్తంభించిన జనజీవనం



వరదయ్యపాళెం: అయ్యవారిపాళెం వద్ద నీట మునిగిన వరి పంట

బుచ్చినాయుడుకండ్రిగ: నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో ఏర్పడిన ఫెంగల్ తుపాన్ కారణంగా సత్యవేడు నియోజకవర్గ వ్యాప్తంగా శుక్రవారం రాత్రి నుంచి శనివారం రోజంతా తీవ్ర గాలులతో కూడిన వాన పడింది. ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో జనజీవనం స్తంభించింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చలి తీవ్రత పెరిగింది. దీంతో వృద్ధులు, చంటి బిడ్డలు ఇబ్బంది పడుతున్నారు.

ఉధృతంగా కాళంగి, కాలువల ప్రవాహం..

మండలంలోని కాళంగి నదిలోకి వర్షపు నీరు భారీగా చేరడంతో ఉధృతంగా ప్రవహిస్తోంది. నది పక్కనే ఉన్న పొలాల్లోకి నీరు చేరడంతో విద్యుత్ మోటార్లు, పంటలు దెబ్బతింటున్నాయి. అదేవిధంగా చీటికాలువ, పందికాలువ, కారణివేరు, కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

నీట మునిగిన వరిపంట..

మండలంలోని జంబుగోళం, జీఎన్‌కండ్రిగ, నెరిణికండ్రిగ, కారణి, కాంపాళెం, వెస్టువరత్తూరు, కుక్కంబాకం, నెలవాయి, కనమనంబేడు, కల్లివెట్టు, తలారివెట్టు, వేణుగోపాలపురం, కమ్మవారికండ్రిగ గ్రామాల్లోని సుమారు 2500 ఎకరాల్లో వరిపంట నీట మునిగి దెబ్బతింది. అలాగే జంబుగోళం, నెరిణికండ్రిగ గ్రామాల్లో 150 ఎకరాల వరకు వరిపంట పూర్తిగా దెబ్బతిన డంతో రూ.15 లక్షలకు పైగా నష్టం వాటిల్లింది. ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. అలాగే మండలంలోని శ్రీకాళహస్తి-తడ రోడ్డులో భారీగా వర్షపునీరు నిలిచింది. కేటీరోడ్డులో వర్షపు నీరు భారీగా నిల్వ ఉండడంతో వాహనదారులకు గుంతలు కనబడక ఇబ్బంది పడ్డారు.

అధ్వానంగా గ్రామీణ రోడ్లు..

మండలంలోని ఆలత్తూరు, పీవీకండ్రిగ, పుత్తేరి, జీఎన్‌కండ్రిగ, ఆర్.అనంతాపురం, జంబుగోళం, పెద్దపాలేడు, గాజులపెళ్లూరు, గ్రామాలకు వెళ్లే రోడ్లు భారీ వర్షానికి గుంతలమయమై అధ్వానంగా మారాయి. ఈ రోడ్లలో ఆర్టీసీ సర్వీసులను కూడా నడపడం లేదు.

విద్యుత్‌కు అంతరాయం..

మండలంలో భారీ వర్షంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. విద్యుత్ స్తంభాలు నేలకూలుతున్నాయి. ట్రాన్స్‌కో సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు.

నారాయణవనంలో..

నారాయణవనం: మండలవ్యాప్తంగా ఈదురు గాలులతో కూడిన వర్షం పడడంతో జనజీవనం స్తంభించింది. తహసీల్దార్ జయరాములు, ఎస్ఐ రాజశేఖర్ సిబ్బందితో పరిస్థితిని సమీక్షిస్తున్నారు. మండలంలో 127.6 మి.మీ. వర్షపాతం నమోదు కాగా, ఆస్తి, ప్రాణ నష్టం జరగలేదని తహసీల్దార్ తెలిపారు. అరుణానదిలోకి భారీగా నీరు చేరడంతో తిరువట్యం, నారాయణవనం, సముదాయం, తుంబూరు, పాలమంగళం వద్ద లోలెవల్ కాజ్‌వేలపై వరద నీరు ప్రవహిస్తోంది. అలాగే కైలాసనాథకోన ఉధృతంగా ప్రవహిస్తుండడంతో జలపాతంలోకి ఎవరినీ అనుమతించడం లేదు. పడివేటమ్మ ఎస్టీ కాలనీలో ఈదురు గాలులకు కొబ్బరిచెట్టు విరిగి షణ్ముగం ఇంటిపై పడగా, స్థానికుల సాయంతో తొలగించారు.

వరదయ్యపాళెంలో..

వరదయ్యపాళెం: మండలంలో శనివారం సాయంత్రం 6 గంటలకు 147.6 మి.మీ.ల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. వరదయ్యపాళెం నుంచి సంతవేలూరుకు వెళ్లే మార్గంలో సీఎల్ఎన్‌పల్లి వద్ద పాముల కాలువ, అంబూరు సమీపంలో మార్లమడుగు కాలువలు ఉధృతంగా ప్రవహించడంతో 10 గ్రామాలకు, పెద్దపాండూరు సమీపంలో రాళ్లకాలువ వద్ద నీటి ఉధృతి పెరగడంతో మరో 7 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. శ్రీకాళహస్తి-వరదయ్యపాళెం ప్రధాన రోడ్డు మార్గంలోని గోవర్ధనపురం వద్ద మారేడు కాలువపై నిర్మించిన కాజ్‌వే పూర్తిగా మరమ్మతులకు గురైంది. శనివారం మధ్యాహ్నం ఆర్టీసీ బస్సు కల్వర్టులో ఇరుక్కోవడంతో అరగంట పాటు స్థానికులు, పోలీసులు సహకారంతో బయటకు లాగారు. నీటి ఉధృతి తగ్గే వరకు ఈ మార్గంలో రాకపోకలను నిలిపేస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

రోడ్లలో గోతులు

తుపాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు మండలంలోని ప్రధాన రోడ్లు ఛిద్రమయ్యాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు సత్యవేడు కడూరు కూడలి తడ-వరదయ్యపాళెం ప్రధాన రోడ్డు మార్గాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఎక్కడ పడితే అక్కడ బావులను తలపించే విధంగా గుంతలు ఏర్పడడంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో పడిన గుంతలు పూడ్చేందుకే కూటమి ప్రభుత్వం ముందుకు రాకపోగా, తాజాగా పడిన గుంతలు పూడ్చేదెవరని వాహనదారులు, ఇటు స్థానికులు ఆందోళన చెందుతున్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

నేలకొరిగిన వృక్షం

సత్యవేడు: బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెంగల్ తుపాను కారణంగా మండలవ్యాప్తంగా శనివారం పెను గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ నేపథ్యంలో వేగంగా వీచిన గాలులకు సత్యవేడు-ఊత్తుకోట ప్రధాన మార్గంలో వెంకటాపురం వద్ద చెట్టు నేలకూలింది. దీంతో హైవే మీద వాహనాల రాకపోకలు ఇరువైపులా స్తంభించాయి. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా ఎస్ఐ రామస్వామి సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్టును స్థానిక సర్పంచ్ సుజాత, గ్రామస్తుల సహకారంతో జేసీబీతో తొలగించారు.

ఏర్పేడులో..

ఏర్పేడు: ఏర్పేడు మండలంలో జడివానకు గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. మండలంలోని కొత్తవీరాపురం సమీపంలో, మునగలపాళెం, చెన్నంపల్లి, గుడిమల్లం స్వర్ణముఖీ నది లోలెవల్ కాజ్‌వేలు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. గుడిమల్లం సీతకాల్వ అడ్డగించడంతో అటువైపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తహసీల్దార్ భార్గవి, ఎంపీడీఓ సౌభాగ్య గ్రామస్థాయి అధికారులను అప్రమత్తం చేస్తూ తుపాను ప్రభావం గురించి ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ లోతట్టు ప్రాంత వాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మండలంలోని సీతారామపేటలో అక్కుపల్లి లోకేష్‌కు చెందిన ఇల్లు వర్షానికి కుప్పకూలింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం జరుగలేదు. అలాగే పంటపొలాలు, వరిపైరు నీటమునిగాయి. అక్కడక్కడా విద్యుత్ తీగలు తెగిపడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఏర్పేడు ఏఈ వాసుదేవయ్య సిబ్బందితో కలిసి సమస్య తలెత్తిన చోటకు వెళ్లి మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. వాగులు, వంకలు ప్రవహిస్తుండడంతో చెరువుల్లో జలకళ సంతరించుకుంది.

5 గ్రామాలకు రాకపోకల బంద్

కేవీబీపురం (వరదయ్యపాళెం): కేవీబీపురం మండలం పూడి-సీకేపురం వద్ద కల్వర్టు తెగిపోవడంతో ఆ ప్రాంతంలోని ఎగువపూడి, మధ్యపూడి, దిగువపూడి, మరో రెండు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. వర్షం వచ్చినప్పుడల్లా ఈ కల్వర్టు కొట్టుకుపోతోంది. శాశ్వత ప్రాతిపదికన కల్వర్టు నిర్మాణానికి అటు అధికారులు గానీ, ఇటు స్థానిక ప్రజాప్రతినిధులు గానీ చొరవ చూపడం లేదని స్థానికులు వాపోతున్నారు. అలాగే పూడి గ్రామానికి చెందిన పశువుల కాపరి ఎస్.రమేష్ మూర్ఛ వ్యాధికి గురయ్యాడు. అయితే పూడి-సీకేపురం వద్ద కల్వర్టు తెగి రాకపోకలు స్తంభించడంతో బాధితుని ఆస్పత్రికి తరలించే అవకాశం లేక మృతి చెందాడని కుటుంబ సభ్యులు వాపోయారు.


ముంచెత్తిన ఫెంగల్

రేణిగుంట: ఫెంగల్ తుపాను ప్రభావంతో శనివారం శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఎడతెరిపి లేకుండా జోరువాన కురుస్తోంది. దీంతో చాలాచోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రేణిగుంట మండలం కరకంబాడి దొడ్లమిట్ట సమీపంలో ఉన్న మల్లిమడుగు రిజర్వాయర్ నిండడంతో డీఈఈ చంద్రమౌళి, ఏఈఈ మునిశంకర్ అన్ని గేట్లు ఎత్తివేశారు. వాగులు వంకలు పొంగి ప్రవహిస్తుండడంతో వివిధ గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. ఎంపీడీఓ విష్ణుచిరంజీవి, తహసీల్దార్ సురేష్‌బాబు అప్రమత్తమై లోతట్టు ప్రాంతాల ప్రజలకు నష్టం వాటిల్లకుండా గ్రామాలా కార్యదర్శులు, వీఆర్‌ఓల ద్వారా సమాచారం తెలుసుకుంటూ పర్యవేక్షించారు. వర్షాలతో గ్రామీణ రోడ్లు బురమయంగా మారి చిన్నపాటి మడుగులను తలపిస్తున్నాయి. మండలంలోని అత్తూరు, నల్లపాళెం, అన్నాసామిపల్లి వాగులు ఉప్పొంగడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.



రేణిగుంట రైల్వేస్టేషన్ సమీపంలో నిలిచిన వర్షపునీరు

శ్రీకాళహస్తిలో 62.8 మి.మీ. వర్షపాతం



స్వర్ణముఖి ఆనకట్ట వద్ద వరద ఉధృతి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తిలో ఏకధాటిగా వర్షం కురుస్తూనే ఉంది. అధికారులు సకాలంలో లోతట్టు ప్రాంతాలను సందర్శించి అక్కడ ఉన్నవారిని అప్రమత్తం చేశారు. తొట్టంబేడు మండలం కారాకొల్లు ప్రాంతంలో వాగు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు స్తంభించాయి. పోలీసులు పహారా ఏర్పాటు చేశారు. పట్టణంలో స్వర్ణముఖి నది ఉధృతి పెరిగింది. రాత్రి ఎగువ ప్రాంతాల నుంచి నీరు వస్తే ఉధృతి మరింత పెరుగుతుంది. అలాగే కైలాసగిరి కొండల నుంచి నీరు స్వర్ణముఖి నదికి చేరుకుంది. ప్రభుత్వాస్పత్రి, పార్కు, పొన్నాలమ్మ, ధర్మరాజుల ఆలయం ప్రాంతం, జయరామరావు వీధిలో రోడ్డుపై నీరు భారీగా చేరింది.



ఏర్పేడు మండలం కొత్తవీరాపురం సమీపంలోని స్వర్ణముఖినదిపై ఉన్న లోలెవల్ కాజ్‌వేపై ప్రవాహం











బుచ్చినాయుడుకండ్రిగ: కనమనంబేడులో నేలకూలిన భారీ వృక్షాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ, పందికాలువను పరిశీలిస్తున్న ఎస్ఐ, పడివేటమ్మకాలనీలో ఇంటిపై విరిగి పడిన కొబ్బరిచెట్టు, చెట్టును తొలగిస్తున్న పోలీసులు, వరదయ్యపాళెం: కడూరు కూడలి వద్ద నీట మునిగిన పొలాలు











కంచరపాళెం వద్ద ధ్వంసమైన రోడ్డు, వాగును పరిశీలిస్తున్న తొట్టంబేడు ఎస్ఐ ఈశ్వరయ్య, భరద్వాజ తీర్థం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న చెక్‌డ్యామ్, ఎన్టీఆర్ పార్కులో.., ఏర్పేడు మండలం సీతారాంపేటలో కూలిన ఇల్లు

స్వర్ణమ్మకు హారతి



పూజలు చేస్తున్న వేదపండితులు



హాజరైన భక్తులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తిలోని స్వర్ణముఖి నదిలో శనివారం నదీ హారతులు వేదోక్తంగా జరిగాయి. ఆలయానికి ఉత్తరవాహిణిగా ప్రవహిస్తున్న స్వర్ణముఖి నదికి నదీహారతులు సమర్పించారు. గంగాదేవి(స్వర్ణముఖి)దేవికి ఆలయం అలంకార మండపంలో విశేష పూజలు చేసి స్వర్ణాభరణాలతో సుందరంగా అలంకరించారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ అమ్మవారిని ఊరేగింపుగా స్వర్ణముఖి నదిలో ఏర్పాటు చేసిన ప్రాంతానికి చేర్చారు. వేద పండితులు ఆగమోక్తంగా పూజలు చేసి మంత్రపుష్పం, నైవేద్యం సమర్పించారు. చతుర్వేద పారాయణం చేసి గంగాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఐదుగురు అర్చకులు వేదికపై స్వర్ణమ్మకు అభిముఖంగా నిలబడి ధూపంతో ప్రారంభించి వివిధ హారతులు సమర్పించారు. అనంతరం స్వర్ణముఖిలో భక్తులు దీపాలు వదలి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం నుంచి వర్షం పడుతుండడంతో శిబిరంలోనే పూజలు చేపట్టారు. భక్తులు కూడా వర్షం కారణంగా అనుకున్న స్థాయిలో రాలేకపోయారు. ఉదయం నుంచి అధికారులు స్వర్ణముఖి నదీ హారతులు జరుగుతాయో లేదో అనే అనుమానంతోనే ఉన్నారు. ఎట్టకేలకు సాయంత్రానికి వర్షం తెరపి ఇవ్వడంతో షెడ్డును సిద్ధం చేసి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, ఈఓ బాపిరెడ్డి దంపతులు, బృందమ్మ, టీడీపీ నాయకులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

- సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్



మాజీ ఎంపీపీ సుదర్శనరెడ్డి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న రాజేష్

నారాయణవనం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకార్తలకు పార్టీ అధిష్టానం వెన్నుదన్నుగా ఉంటుందని సత్యవేడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నూకతోటి రాజేష్ అన్నారు. శనివారం స్థానిక సొరకాయలస్వామి కల్యాణ మండలంలో శనివారం మాజీ ఎంపీపీ సుదర్శనరెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మాజీ ఎంపీపీగా, మాజీ డీసీసీబీ డైరెక్టర్‌గా మండలంలో పార్టీని నడిపించిన సుదర్శనరెడ్డి సేవలు మరువలేనివన్నారు. కూటమి ప్రభుత్వ అరాచకాల నుంచి నాయకులు, కార్యకర్తలను కాపాడుకుంటామని తెలిపారు. ఎవరి ఒత్తిళ్లకు, బెదిరింపులకు భయపడవద్దన్నారు. అనంతరం అందరికీ భోజనాలు వడ్డించారు. కార్యక్రమంలో ఎంపీపీ దివాకర్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ సొరకాయలు, నాయకులు బీరేంద్రవర్మ, భానుప్రకాష్ రెడ్డి, రాకేష్‌కిరణ్, నాయకులు గురుస్వామి, సుబ్రమణ్యంయాదవ్, మనోహర్, ఢిల్లీబాబు, శంకరయ్య, ధర్మలింగం, అశోక్, కేశవులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.